
సాక్షి అనకాపల్లి

శనివారం : 5 : ఏప్రిల్ : 2025



7 నుంచి అప్పన్న కల్యాణోత్సవాలు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల 7నుంచి 13 వరకు జరగనున్నాయి.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	36.3/24.4
చోడవరం	:	34.0/24.0



చిన్నారికి గ్లకోమా శస్త్ర చికిత్స
ఎనిమిది నెలల గిరిజన శిశువుకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గ్లకోమా శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

కూలెప్పుడిస్తావు.. బాబూ?



చీడిపల్లిలో నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

- మూడు నెలలుగా ఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు అందని వేతనాలు
- జిల్లాలో సుమారు రూ.52 కోట్ల బకాయిలు
- నిధులు విడుదల కాలేదంటున్న అధికారులు
- వేతనాల కోసం వేచి చూస్తున్న 2.89 లక్షల మంది ఉపాధి కూలీలు

సాక్షి, అనకాపల్లి :

వ్యవసాయ పనులు లేకపోవడంతో ప్రజలంతా ఉపాధి పనుల బాట పట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పనులు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విస్తృతంగా జరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది జనవరి 5 నుంచి నేటి వరకు దాదాపు మూడు నెలల ఉపాధి కూలీల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది.. ఏదో ఇంటి ఖర్చుల కోసం ఉపాధి పనులకు వెళ్లే కూలీలు మూడు నెలల వేతనాలు పడకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. డబ్బులు ఎప్పుడు పడతాయా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో సుమారు రూ.52 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇంకా నిధులు విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఎస్.రాయవరం మండలంలో అత్యధికంగా రూ.3.95 కోట్ల బకాయిలున్నాయి.

ఒక్కో కూలీకి సగటున రూ.23 వేల బకాయి..

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీకి రోజుకు రూ.250 నుంచి రూ.300 కూలీ డబ్బులు పడుతున్నాయి. మూడు నెలల బకాయి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకూ బకాయి చెల్లించాల్సి ఉంది.



గడ్డి తిని బతకాలా?

- ఉపాధి కూలీల వినూత్న నిరసన

చీడికాడ: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేస్తూ చీడిపల్లిలో ఉపాధి కూలీలు వినూత్నంగా నిరసన తెలిపారు. కూలి డబ్బులు ఇవ్వకపోతే గడ్డి తిని బతకాలా.. అని ప్రశ్నిస్తూ నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వేతనాల బకాయిలపై వెంకన్న వద్ద మొరపెట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నాటికి జిల్లాలో 9 వారాలకు రూ.53 కోట్ల మేర వేతన బకాయిలున్నట్లు తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించని సంబంధిత శాఖపై కూలీలు కేసులు పెట్టుకునే అవకాశం ఉపాధి చట్టంలో ఉందని గుర్తు చేశారు.

ప్రభుత్వంపై ఎందుకు కేసులు పెట్టకూడదు?

జిల్లాలో ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలి. సకాలంలో బకాయిలు చెల్లింపులు చేయని సంబంధించిన శాఖపై కూలీలు కేసులు పెట్టుకునే అవకాశం చట్టంలో ఉంది. అ పరిస్థితి రాక ముందే తక్షణమే బకాయిలు చెల్లించాలి. ఈ ఏడాది కొత్తగా మంజూరైన పనులకు రూ.7 పెంచామని ప్రభుత్వం చెబుతుంది. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. గతంలో తట్టా, గునపాం, పార, మంచినీళ్ల ఏర్పాటు చేసి, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్సులు ఇచ్చేవారు. అవి పూర్తిగా కట్ చేసి రూ.7 పెంచినట్లు ప్రకటించడం అన్యాయం. ఉపాధి హామీ శాఖకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంత్రిగా ఉండి కూలీల కష్టాన్ని అర్థం చేసుకోకపోవడం విచారకరం. ఉపాధి హామీకి లక్ష కోట్లు ఉన్న బడ్జెట్‌ను పీఎం మోదీ ప్రభుత్వం దశలవారీగా రూ.62 వేల కోట్లకు తగ్గించింది. గట్టిగా ఉన్న నేలకు అదనంగా డబ్బులు ఇవ్వాలి.

– డి.వెంకన్న, ఏపీ వ్యవసాయి కార్మిక సంఘం కార్యదర్శి

జిల్లాలో మొత్తం జాబ్ కార్డులు	2,81,075
పనులకు హాజరయ్యే యాక్టివ్ జాబ్ కార్డులు	2,02,924

ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలు

రోజుకు సగటున హాజరయ్యే వారు లక్షకు పైగానే..

మండలాలవారీగా బకాయిలు

ఎస్.రాయవరం	రూ.3.95 కోట్లు
అనకాపల్లి	రూ.3.13 కోట్లు
కోటవురట్ల	రూ.3.19 కోట్లు
నక్కపల్లి	రూ.2.97 కోట్లు
నర్సీపట్నం	రూ.2.19 కోట్లు
రావికమతం	రూ.2.72 కోట్లు
రోలుగుంట	రూ.2.73 కోట్లు
బుచ్చెయ్యపేట	రూ.2.69 కోట్లు
చీడికాడ	రూ.2.24 కోట్లు
గొలుగొండ	రూ.2.37 కోట్లు
సబ్బవరం	రూ.1.94 కోట్లు
యలమంచిలి	రూ.1.36 కోట్లు
రాంబిల్లి	రూ.1.94 కోట్లు
పాయకరావుపేట	రూ.1.85 కోట్లు
కె.కోటపాడు	రూ.1.38 కోట్లు
దేవరాపల్లి	రూ.1.70 కోట్లు
నాతవరం	రూ.1.77 కోట్లు
మునగపాక	రూ.1.73 కోట్లు
మాడుగుల	రూ.1.72 కోట్లు
కశింకోట	రూ.1.49 కోట్లు
చోడవరం	రూ.1.37 కోట్లు
అచ్యుతాపురం	రూ.72 లక్షలు
పరవాడ	రూ.84 లక్షలు
మాకవరపాలెం	రూ.32 లక్షలు

వైఎస్సార్‌సీపీ నేతకు బెయిల్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నేత, బీసీ కార్పొరేషన్ **స్టేట్ మాజీ డైరెక్టర్** కర్రి శ్రీనివాసరావు కండిషన్ **బెయిల్‌పై విడుదలయ్యా**రు. శ్రీనివాసరావును నం**ద్యాల జిల్లా, జలదుర్గం** పోలీసులు ఈ నెల 2వ **తేదీన అరెస్టు చేసి డోన్** కోర్టులో హాజరుపరిచారు. **మేజిస్ట్రేట్ వారంలో** మూడు రోజులు పోలీసుల **ఎదుట హాజరు కావాల**ని, 60 రోజులపాటు నంద్యాల పరిధి దాటి వెళ్లవద్దంటూ శ్రీనివాసరావుకు కండిషన్ బెయిల్ మంజూరు చేశారు. జలదుర్గం పోలీసు స్టేషన్ నుంచి శ్రీనివాసరావు సాక్షితో మాట్లాడుతూ రాజకీయ కక్షలతో తన ఆస్తులను ధ్వంసం చేస్తున్న సమయంలో ఆవేశంతో మాట్లాడితే స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంతోపాటు రాష్ట్రంలో పలు చోట్ల కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా తనకు పార్టీ అండగా నిలిచిందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సారథ్యంలోనే పని చేస్తానన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన స్థాయికి తగిన వారితో రాజకీయాలు చేస్తే బాగుంటుందన్నారు. సామాన్య నాయకుడైన తనపై కేసులు పెట్టించి వేధించటం స్పీకర్‌కు భావ్యం కాదని ఆవేదన వెలిబుచ్చారు.



జలదుర్గం పోలీసు స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కర్రి శ్రీనివాసరావు

22న రమాకుమారిపై అవిశ్వాసం

యలమంచిలి పట్టణ కౌన్సిలర్లకు అధికారికంగా సమాచారం ఇచ్చిన కలెక్టర్

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి 25 మంది వార్డు సభ్యులకు అధికారికంగా సమాచారం వచ్చింది. పురపాలకసంఘానికి 2021లో జరిగిన ఎన్నికల్లో 25 వార్డులకు 23 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున వార్డు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. టీడీపీ నుంచి ఒకరు, మరొక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందినవారిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాలతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పిల్లా రమాకుమారి ఎన్నికయ్యారు. ఇటీవల పిల్లా రమాకుమారి బీజేపీలో చేరారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన 18 మంది కౌన్సిలర్లు రమాకుమారిపై అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టరుకు నోటీసు ఇచ్చారు. నిర్దేశిత ఫార్మాట్‌లో ఇచ్చిన నోటీసు పరిశీలించిన కలెక్టర్ విజయ కృష్ణన్ ఈ నెల 22వ తేదీన అవిశ్వాస తీర్మానం ప్రక్రియకు సంబంధించి కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు స్థానిక మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

వైఎస్సార్‌సీపీ సభ్యులకు ప్రలోభాలు!

మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన దగ్గర్నుంచి రమాకుమారి వర్గీయులు వైఎస్సార్‌సీపీ సభ్యులకు ప్రలోభాల ఎర వేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే నలుగురైదుగురు వార్డు సభ్యులకు ప్రలోభాల ఆశ చూపి రమాకుమారికి మద్దతునిచ్చేలా ఆమె తరపువారు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ముగ్గురు వార్డు సభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది.

సమావేశమే జరగకుండా తీర్మానమా? 8లో

హాకీ చీఫ్ సెలక్టర్‌గా రమేష్



యలమంచిలి రూరల్: పట్టణానికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారుడు శెట్టి రమేష్ రాష్ట్ర మెన్స్ జూనియర్ హాకీ పోటీలకు చీఫ్ సెలక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే హాకీ పోటీలకు శెట్టి రమేష్ చీఫ్ సెలక్టర్‌గా వ్యవహరించనున్నారు. యలమంచిలికి చెందిన రమేష్ గతంలో వరుసగా ఎనిమిదిసార్లు జాతీయ హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు. అనుభవం కలిగిన రమేష్‌ను రాష్ట్ర మెన్స్ జూనియర్ హాకీ పోటీలకు చీఫ్ సెలక్టర్‌గా నియమిస్తూ హాకీ ఆంధ్రప్రదేశ్ చీఫ్ నిరంజన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొఠారు నరేష్ శుక్రవారం రాత్రి మీడియాకు తెలిపారు. యలమంచిలికి చెందిన క్రీడాకారుడికి తొలిసారిగా చీఫ్ సెలక్టర్‌గా వ్యవహరించే గౌరవం లభించడం పట్ల సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట పొలాల్లో బస్సు బోల్తా

- ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం
- ఆరుగురికి గాయాలు
- ఎన్టీఆర్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స



అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న సీతామహాలక్ష్మి

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం పురుషోత్తపురం సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఏపీఎస్ఆర్టీసీ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు పురుషోత్తపురం సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కగా ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి కొబ్బరి చెట్టును ఢీకొట్టింది. అప్పటివరకూ సాఫీగా ప్రయాణిస్తున్న బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో బస్సులో ప్రయాణికులంతా భయంతో కేకలు పెట్టారు. ప్రమాద సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురు గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే యలమంచిలి రూరల్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పురుషోత్తపురం గ్రామస్థులు ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులను బస్సులోంచి బయటకు తెచ్చేందుకు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్సు వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కె.వెంకటలక్ష్మి (64) తీవ్రంగా గాయపడింది. ఆమె తలకు బలమైన గాయం తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆమెకు ప్రథమ చికిత్స అనంతరం మెదడుకు సీటీ స్కాన్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ కిరణ్ కుమార్(50), సీహెచ్ సుదర్శన్ (53), అన్నవరానికి చెందిన కె.సీతామహాలక్ష్మి (64), నారాయణపేటకు చెందిన జి.రాజు (35), బి.నవీన (30) గాయపడిన వారిలో ఉన్నారు. వీరందరికీ వైద్యుల పర్యవేక్షణలో ప్రథమ చికిత్స చేశారు. ప్రస్తుతం క్షతగాత్రులందరి పరిస్థితి నిలకడగా ఉందని డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు ప్రమాద కారణాలపై ఆరా తీస్తున్నారు.



పంట పొలాల్లో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు



తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు వెంకటలక్ష్మి

అనువాద ప్రతిభతో ఆరు అవార్డులు

ఆంగ్ల ఉపాధ్యాయిని నాగజ్యోతి మరో రికార్డు

రోలుగుంట: ఆమె ఆంగ్ల ఉపాధ్యాయిని.. తన అసమాన క్రీడా ప్రతిభతో గతంలో ఆమె వార్తలకెక్కారు. ఇప్పుడు అనువాదంలో అందె వేసిన చేయిగా నిరూపించుకొని ఏకంగా ఆరు అవార్డులు సాధించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న పీవీఎం నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ పోటీలలో ఎన్నో పతకాలు సాధించిన విషయం తెలిసిందే. గత సంవత్సరం సింగపూర్, మలేషియాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మూడు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించారు. ఇప్పుడు మరో అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు వరల్డ్ రికార్డు హోల్డర్, రెప్లికా ఆర్టిస్ట్ డాక్టర్ దార్ల నాగేశ్వరరావు 'ఎవెరీడే సెల్యూట్ టు ఉమెన్స్' కాన్సెప్ట్ నడుపుతున్నారు. దీని కోసం నాగజ్యోతి ఏడాదిపాటు ప్రతిరోజు తెలుగులో ఉన్న విషయాన్ని ఇంగ్లిష్ భాషలో అనువదించారు. ఆమె ప్రతిభకు ముగ్ధులైన ప్రపంచ రికార్డు సంస్థల వారు అవార్డులను అందజేశారు. దార్ల బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఫ్యాబులస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఫెంటాస్టిక్ అచీవ్‌మెంట్స్ అండ్ రికార్డ్స్, ఇండియా రికా, మార్వలెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆమెను వరించాయి. వీటిని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దార్ల నాగేశ్వరరావు, సుమన్, శ్రీకాంత్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల హెచ్‌ఎం డి.వి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, సహచర సీనియర్ టీచర్లు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, శ్రీరామ్మూర్తి, విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



తాను సాధించిన రికార్డుల ధ్రువపత్రాలతో నాగజ్యోతి

- కరెంట్ ఇష్యూ

కోర్టు ఆదేశించినా సర్కారు కినుక



ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

- ఏపీఈపీడీసీఎల్‌లో 1,354 మంది జూనియర్ లైన్‌మెన్ పదోన్నతుల్లో విచిత్రం
- 18 ఏళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంపై అభ్యంతరాలు
- ఫలితంగా సీనియర్లు సైతం జూనియర్లుగా మిగిలిపోయిన పరిస్థితి
- హైకోర్టు ఆదేశించినా అమలుచెయ్యని డిస్కంలు
- కోర్టు కేసుల కారణంగా క్రమబద్ధీకరించలేకపోయిన గత ప్రభుత్వం
- సీనియార్టీ ప్రకారం జాబితా సిద్ధం చేయాలని 10 నెలల క్రితం హైకోర్టు ఆదేశాలు
- అయినా పాత జాబితానే కొనసాగిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : ఏ సంస్థలోనైనా చేసిన సర్వీస్ ప్రకారం సీనియారిటీని పరిగణిస్తుంటారు. కానీ.. విద్యుత్ పంపిణీ సంస్థల్లో మాత్రం విచిత్రంగా పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకున్నారు. ఉద్యోగి వయసు 40 సంవత్సరాలై సర్వీసు 15 ఏళ్లున్నప్పటికీ.. యాభై ఏళ్ల ఉద్యోగికి ఐదేళ్ల సర్వీసు ఉంటే.. సదరు ఉద్యోగినే సీనియర్‌గా పరిగణించారు. ఇలా 2008లో డిస్కం అధికారులు అడ్డగోలుగా పదోన్నతుల జాబితా తయారుచేశారు. దీనిపై కొందరు అప్పట్లోనే హైకోర్టుని ఆశ్రయించారు. సర్వీసు ప్రకారం పదోన్నతుల జాబితా సిద్ధంచెయ్యాలంటూ 2024 జూన్‌లో న్యాయస్థానం ఆదేశించినా.. టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీనిపై సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నిజానికి 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే ముందు కరెంట్ పోతే ఫ్యూజులు బిగించేందుకు రైతులే వెళ్లి మృత్యువాత పడేవారు. దీంతో డిస్కంలలో లైన్‌మెన్ల కొరత వేధిస్తోందని తెలుసుకున్న వైఎస్సార్.. ఉమ్మడి రాష్ట్రంలో వెంటనే 7,114 పోస్టుల్ని భర్తీచేశారు. ఈ సమయంలో ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు ఉమ్మడి సర్కిల్స్ పరిధిలో 1,220 పోస్టులు భర్తీఅయ్యాయి.

సీనియారిటీ లిస్టుల్లో అధికారుల నిర్లక్ష్యం..

2008లో కొత్తగా రిక్రూట్ చేసిన లైన్‌మెన్ల గత అనుభవాన్ని అనుసరించి.. సీనియారిటీ లిస్టులు తయారుచెయ్యాలని అప్పటి ప్రభుత్వం డిస్కంలని ఆదేశించింది. అయితే.. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జాబితా సిద్ధంచేసేశారు. పనిచేసిన అనుభవం బట్టి కాకుండా.. వయసు బట్టి జాబితా తయారుచేశారు. దీనిపై అప్పట్లోనే అధికారులపై నాటి సీఎం వైఎస్ మండిపడ్డారు. ఆ తర్వాత ఆయన మృతిచెందడం.. తర్వాత ప్రభుత్వాలు విస్మరించడంతో నేటికి కూడా సీనియర్లు జూనియర్లుగానే మిగిలిపోయారు. జూనియర్లు మాత్రం ప్రమోషన్లు తీసుకుని సీనియర్లుగా చలామణి అవుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు బాధిత లైన్‌మెన్‌లు హైకోర్టుని ఆశ్రయించారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రయత్నించినా..

సీనియారిటీ జాబితా విషయంలో అన్యాయం జరిగిందంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి బాధిత లైన్‌మెన్‌లు తీసుకెళ్లారు. అయితే.. అప్పటికే కోర్టులో కేసు నడుస్తుండటంతో ఫలితం దక్కలేదు. చివరి నిమిషం వరకూ సీనియారిటీ జాబితాలో మార్పులు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో.. గతేడాది జూన్ 21న హైకోర్టు తీర్పు వెలువరించింది. పనిదినాల ఆధారంగా మాత్రమే కొత్తగా సీనియారిటీ జాబితా తయారుచేయాలని.. వయసు ఆధారంగా చేసిన జాబితాని వెంటనే రద్దుచేసి.. కొత్తగా తయారుచేయాలని డిస్కంలని ఆదేశించింది. అయినా, కూటమి ప్రభుత్వం న్యాయస్థానం తీర్పుని పెడచెవిన పెట్టింది. 10 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదు. పలుమార్లు అధికారులకు, ప్రభుత్వ ప్రతినిధులకు లైన్‌మెన్‌లు వినతులు సమర్పించినా.. సీనియారిటీ లిస్టుని మార్చడంలేదు. ఇటీవల ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌లో ప్రక్రియ ప్రారంభించారు. అయితే.. ఈపీడీసీఎల్ అధికారులు మాత్రం .. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే, 2007లో జూనియర్ లైన్‌మెన్‌లుగా ఎంపికైన 138 మందికి ఉద్యోగాలు ఇవ్వకుండా ఈపీడీసీఎల్ అధికారులు అడ్డుపుల్ల వేశారు. దీనిపై వారు కోర్టుకు వెళ్లగా.. 138 మందికి ఉద్యోగాలివ్వాలని 2011లో న్యాయస్థానం ఆదేశించింది. వీరు విధుల్లో చేరినా సీనియారిటీని కోల్పోయారు. ఇలా.. ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్‌లో 118 మంది, విజయనగరం సర్కిల్‌లో 136, విశాఖపట్నంలో 198, రాజమండ్రిలో 549, ఏలూరులో 353 మంది కలిపి మొత్తం 1,354 జూనియర్ లైన్‌మెన్‌లు పదోన్నతులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్టు తీర్పుని తక్షణమే అమలుచేస్తే.. ఈపీడీసీఎల్ సహా మూడు డిస్కంల పరిధిలో సుమారు 3,500 మంది ఉద్యోగులకు పదోన్నతులు దక్కుతాయి.



ఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

8 నుంచి రైల్వే స్పోర్ట్స్ మీట్

విశాఖ స్పోర్ట్స్: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర విభాగాల స్పోర్ట్స్ మీట్ ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అరకు, దమన్‌జోడి, కోరాపుట్, కిరండూల్, బచేలి, రాయఘడ, పలాస, శ్రీకాకుళం ప్రాంతాలలోని వివిధ విభాగాలకు చెందిన 19 జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. పురుషుల కోసం ఫుట్‌బాల్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, టేబుల్‌టెన్నిస్, బాడీబిల్డింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్, క్రికెట్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. మహిళలకు టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్, అథ్లెటిక్స్ మొదలైన అంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బోహ్రా, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్‌ఎం) మనోజ్‌కుమార్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ప్రవీణ్ బాతి, సంయుక్త క్రీడాధికారులు అవినాష్, నరేంద్ర కురి ఆవిష్కరించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఇతర అధికారులు

క్లుప్తంగా

బాలిక ఆచూకీ లభ్యం

- 24 గంటల్లో కనుగొన్న పోలీసులు



సంజనను అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం: జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని బొబ్బిలి సాయి సంజన(16) అదృశ్యంపై తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అనుమానితుల ఫోన్ నంబర్ల ఆధారంగా గాలించారు. చివరగా శుక్రవారం లంబసింగి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్ఐ శ్రీనివాస్ లంబసింగి వెళ్లి బాలికను తీసుకొని వచ్చి తల్లి కుమారికి కొత్తకోట పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

మరింత మెరుగ్గా పోలీస్ భద్రతా ప్రమాణాలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి
- ఏఆర్ పోలీస్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు



సలాం చేస్తున్న జాగిలానికి నమస్కరిస్తున్న డీఐజీ గోపీనాథ్


ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ నగరంలోని విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. పోలీస్ జాగిలాలు డీఐజీకి సలాం చేశాయి. ఈ సందర్భంగా డీఐజీ పోలీసుల ఆయుధాలు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. సెక్యూరిటీ వెల్ఫేర్ విభాగం రికార్డులు పరిశీలించారు. ఇక్కడ నార్కోటిక్ జాగిలం బన్నీకి మత్తు పదార్థాలు కనిపెట్టినందుకు ఆయన రివార్డ్ ప్రకటించారు. వాహనాల నిర్వహణ, ఆయుధాల పనితీరు, శిక్షణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్ల గురించి ఎస్పీ తుహిన్ సిన్హాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీస్ భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరముందన్నారు.

సమావేశమే జరగకుండా తీర్మానమా?

తారస్థాయికి.. కూటమి కుయుక్తులు

- మేయర్ మార్పు కోసం నిబంధనలకు పాతర
- అజెండా అంశాన్ని.. తీర్మానంగా పేర్కొంటూ కలెక్టర్ నోటీస్
- 58 మంది కార్పొరేటర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదించినట్లు వెల్లడి
- అజెండాలో చర్చించకుండానే.. ప్రతిపాదన ఎలా సాధ్యమంటున్న సభ్యులు
- కలెక్టర్ నోటీసుపై సర్వత్రా అనుమానాలు





తీర్మానం:

తీర్మానం కాపీ



గత నెల 31వ తేదీన కలెక్టర్ జారీ చేసిన నోటీసు

ఎంవీపీకాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమి ప్రభుత్వం కుయుక్తులు తారస్థాయికి చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ మేయర్ మార్పు అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. నిజానికి గ్రేటర్ విశాఖలో కూటమి ప్రభుత్వానికి మేయర్‌ను మార్పు చేసేంతగా బలం లేదు. అయినప్పటికీ ఫిరాయింపులకు తెరతీయడం ద్వారా నగర మేయర్‌ను మార్పు చేయాలని గత కొంతకాలంగా కూటమి ప్రయత్నాలు చేస్తోంది. సాంకేతికంగా మార్పు సాధ్యం కానప్పటికీ దొడ్డిదారిలో కథ నడిపించేందుకు కూటమి నాయకుల సారథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు పావులు కదుపుతున్నారు. తాజాగా 58 మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారంటూ కలెక్టర్ నోటీసులు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు సమావేశమే జరగకుండా జిల్లా కలెక్టర్/జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ అవిశ్వాస తీర్మాన నోటీసు ఎలా జారీ చేస్తారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తీర్మానంపై సర్వత్రా అనుమానాలు

మేయర్ మార్పు అంశంపై కూటమి నాయకుల సారథ్యంలో ఉన్నతాధికారులు చేస్తున్న నిర్ణయాలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ మార్పు అంశంపై ఇప్పటి వరకు కౌన్సిల్‌లో ఎలాంటి చర్చ జరగలేదు. ఈ నెల 19న కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా..నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని అజెండాలో మాత్రమే చేర్చాల్సి వుంది. అనంతరం 19న దీనిపై చర్చ జరిపి కార్పొరేటర్ల ప్రతిపాదనలు మేరకు అవిశ్వాసంపై తీర్మానం పెట్టే వీలుంటుంది. అయితే ప్రస్తుతం అజెండా అంశంగా ఉన్న మేయర్ మార్పుపై తీర్మానం జరిగినట్లు కలెక్టర్/ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నోటీసు విడుదల చేయడం కూటమి అడ్డగోలు వ్యవహారానికి అద్దం పడుతోంది. పైగా తీర్మానాన్ని 58 మంది కార్పొరేటర్లు ప్రతిపాదించినట్లు కలెక్టర్ ఆ నోట్‌లో వెల్లడించడంపై అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. తీర్మానంపై 58 మంది సభ్యులు సంతకం చేసిన ప్రతిని కౌన్సిల్ సభ్యులందరికీ పంపించినట్లు కూడా కలెక్టర్ తన నోటీసులో పేర్కొన్నారు. అయితే అలాంటి ప్రతులు శుక్రవారం అర్ధరాత్రి వరకు తమకు ఏమీ అందలేదని పలువురు కౌన్సిల్ సభ్యులు వెల్లడించారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల తీరుతో పాటు కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ఈ అడ్డగోలు వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

- నిర్వాసితులకు త్వరలోనే పునరావాసం
- మూలపర గ్రామసభలో ఆర్‌డీవో రమణ



ప్యాకేజీ పెంచాలని వినతి పత్రం ఇస్తున్న రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో రమణ

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు త్వరలోనే పునరావాసం కల్పించడంతో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి.రమణ తెలిపారు. శుక్రవారం అమలాపురం శివారు మూలపర గ్రామంలో నిర్వాసితులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గ్రామాన్ని ఖాళీ చేయించాల్సిన పరిస్థితి వస్తోందని, ఇళ్లు కోల్పోయిన వారందరికీ పెద బోదిగల్లం వద్ద పునరావాసం కల్పిస్తామన్నారు. 2024 డిసెంబరు 31వ తేదీని కటాఫ్‌గా పరిగణనలోకి తీసుకుని నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి గుర్తించిన లబ్ధిదారుల జాబితాను ఈ గ్రామసభలో విడుదల చేశారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేసుకోవాలని ఆయన కోరారు. ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, తదితరులు మాట్లాడుతూ అధికారులు విడుదల చేసిన జాబితాల్లో కొంతమంది అనర్హులు ఉన్నారన్నారు. స్థానికేతరులను ఈ గ్రామంలో నివాసం ఉంటున్నట్లు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారని, వీటిపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారులు ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టి అనర్హులను జాబితా నుంచి తొలగించాలని కోరారు. వచ్చిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేస్తామని ఆర్డీవో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాకాసుల గోవిందు, సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ నిర్వాసితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం, రూ.8.30 లక్షలు ప్యాకేజీ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మూలపర గ్రామంలో 198 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నిర్మాణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ప్యాకేజీ పెంచాలని కోరారు. 18 ఏళ్లు నిండి వివాహమైన మహిళలకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, సర్పంచ్ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం ఎంపీపీగా సర్వేశ్వరరావు బాధ్యతల స్వీకారం



సర్వేశ్వరరావును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితరులు

మాకవరపాలెం: ఎంపీపీగా రుత్తల సర్వేశ్వరరావు బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఎంపీపీ సత్యనారాయణ రాజీనామా చేయడంతో గత నెల 27న ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో సభ్యులు సర్వేశ్వరరావును ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, పార్టీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు.. సర్వేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, వైస్ ఎంపీపీ రాజారావు, పెట్ల భద్రాచలం, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

షేర్ ఆటోగా నమ్మించి మహిళకు టోకరా

పట్టపగలు బంగారం గొలుసు చోరీ



బాధితురాలు లక్ష్మమ్మ

నర్సీపట్నం: పట్టపగలు మహిళ మెడలో బంగారం తాడును దుండగులు తెంచుకువెళ్లిన ఘటన నర్సీపట్నంలో వెలుగు చూసింది. బాధితురాలు కథనంగా ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం, చీడిగుమ్మల గ్రామానికి చెందిన లోకారపు లక్ష్మమ్మ ఈ నెల 3న ఇంట్లోకి నిత్యావసర సరకుల కొనుగోలు చేసేందుకు నర్సీపట్నం వెళ్లింది. నిత్యావసర సరకులు కొనుగోలు చేసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు ఐదు రోడ్ల కూడలిలోని ఐస్ పార్లర్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. చీడిగుమ్మల తీసుకువెళ్తున్నట్టు నటించి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ నుంచి వెనక్కి తిప్పేశారు. నర్సీపట్నం టౌన్‌లో నుంచి కొత్తవీధి, పెదబొడ్డేపల్లి రోడ్డులో ఉన్న శ్మశానవాటిక వద్ద మహిళ మెడలోని రూ.2 లక్షలు విలువ చేసే రెండు తులాల బంగారు తాడు తీసేసుకొని, ఆమెతో పాటు ఆటోలో నిత్యావసర సరకులు దించేసి వెళ్లిపోయారు. ఇదంతా ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. మహిళ లబోదిబోమంటూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. శుక్రవారం కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని టౌన్ సీఐ గోవిందరావును కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లిలో జలమయమైన ప్రధాన రోడ్డు

దేవరాపల్లి: దేవరాపల్లి మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులుతో కూడిన భారీ వర్షం పడడంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో ప్రధాన రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది. దేవరాపల్లిలోని శ్రీకృష్ణాలయం పక్కన ఉన్న గ్రామ సచివాలయం-2 వద్ద అగ్రహారపు మంగరాజు ఇంటిలోకి డ్రైనేజీల్లో నుంచి నీరు ప్రవేశించింది. ఇంట్లో సరుకులు, తిండి గింజలు, ఇతర సామగ్రి తడిసి ముద్దయ్యాయని బాధితుడి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి



రమణారావు(ఫైల్)

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి బగాది రమణారావు(40) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, సంతకవిటి మండలం, జి.ఎస్.పురం గ్రామానికి చెందిన రమణారావు అచ్యుతాపురంలో అద్దెకు నివాసముంటూ పరవాడలోని ఓ ఫార్మా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏ షిఫ్ట్‌కు వెళ్లేందుకు ఆయన బైక్‌పై కూడలికి చేరుకున్నారు. యలమంచిలి రోడ్డు నుంచి అనకాపల్లి వైపు మలుపు తిరుగుతున్న సమయంలో బైక్‌పై వెళ్తున్న రమణారావును లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జరిగిన దుర్ఘటనపై విచారణ చేపట్టి సీఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రొంగలి రాము మాట్లాడుతూ మృతి చెందిన రమణారావు కుటుంబానికి లారీ యజమానితో పాటు పరిశ్రమ యాజమాన్యం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేవీ ప్రాజెక్ట్ లారీలు ఎటువంటి అనుమతులు లేకుండా అనకాపల్లి, అచ్యుతాపురం రహదారిలో యథేచ్ఛగా తిరుగుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. లారీల యాజమానులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

స్మార్ట్ మీటర్ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న స్మార్ట్ మీటర్ల ఉద్యోగులు

నర్సీపట్నం: కొత్త జీతం వద్దు..పాత జీతమే ఇవ్వాలంటూ అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ల ఉద్యోగులు ప్లకార్డులతో శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మార్చి 31వ తేదీ నుంచి ఉద్యోగులు విధులు బహిష్కరించి, ఆందోళన బాటపట్టారు. పాత జీతం ముద్దు.. కొత్త జీతం వద్దు, ఏడాది ఒప్పందం కొనసాగించాలి.. అంటూ నినాదాలు చేశా రు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. జాయినింగ్ లెటర్‌లో ఇచ్చిన ప్రకారం జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. పాత జాయినింగ్ లెటర్‌లో ఉన్న హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికుల జీతాల్లో కోత

ఆలోచన విరమించాలంటూ మున్సిపల్ వర్కర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

నర్సీపట్నం: ఔట్‌సోర్సింగ్ వర్కర్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదు.. పర్మినెంట్ చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ శానిటేషన్, వాటర్ సప్లయి, ఇతర విభాగాల ఔట్‌సోర్సింగ్ వర్కర్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ అంశంపై కొన్నేళ్లుగా పోరాడితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని చూస్తుందన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే నెలనెలా జీతాలు చెల్లించకపోగా కార్మికుల జీతాల్లో కోత విధిస్తారన్నారు. కార్మికులపై వేధింపులు పెరుగుతాయన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే పర్మినెంట్ చేయాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు కె.రాజు, రమణ, అర్జమ్మ, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాశీపురం రైతు బిడ్డ పరదేశినాయుడుకు డాక్టరేట్



తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి గోవి చెజియాన్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకుంటున్న ఆదిరెడ్డి పరదేశినాయుడు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం రైతు కుటుంబానికి చెందిన ఆదిరెడ్డి పరదేశినాయుడు శుక్రవారం చెన్నైలోని భారత్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి గోవి చెజియాన్ చేతుల మీదుగా అందుకున్నారు. పరదేశినాయుడు గత 18 ఏళ్లుగా అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మైక్రో బయాలజీ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. డెంగ్యూ వైరస్‌పై జరిపిన పరిశోధనలకు డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. పరదేశినాయుడు పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై స్థానిక ప్రజలు, పెద్దలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌గా తడి, పొడి చెత్త సేకరణ

- ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం
- డీపీవో శిరీషారాణి



నక్కపల్లిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

నక్కపల్లి: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ తడి, పొడి చెత్తను ఇళ్ల వద్ద నుంచే సేకరించే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. గ్రామాల్లో శుక్రవారం పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదేశాల మేరకు తడి, పొడి చెత్తను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రం నక్కపల్లిలో తడి, పొడి చెత్తను సేకరించే కార్యక్రమాన్ని డీపీవో స్వయంగా పరిశీలించారు. పంచాయతీ స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్ల సాయంతో ప్రతి ఇంటికి వెళ్లి ప్లాస్టిక్ డబ్బాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాస్(స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర) కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వీధులు అపరిశుభ్రంగా ఉంటున్నాయని చెప్పారు. సాస్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ ప్రక్రియను రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఒకేసారి చేపడుతున్నామన్నారు. ప్రజల్లో కూడా విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్ద వేర్వేరుగా ఉంచి వానపాముల సాయంతో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నట్టు చెప్పారు. చినదొడ్డిగల్లు సంపద తయారీ కేంద్రాల వద్ద కార్యక్రమాలను మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ పరిశీలించారు. తడి, పొడి చెత్తను సిబ్బంది వేరు చేశారు. కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ చంద్రరావు, ఎంపీడీవో సీతారామరాజు, ఉప సర్పంచ్ వీసం రాజు, పంచాయతీ కార్యదర్శి బీఏబీఎల్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



ఏప్రిల్ మాసం విద్యుత్ పోరాటాల వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సెకి ఒప్పందాలు రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై ఎనలేని భారాలు మోపిన విద్యుత్ సంస్కరణలపై ఏప్రిల్ మాసంలో ప్రజలను చైతన్యవంతం చేసి దశలవారీగా పోరాటాలకు సన్నద్ధం చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు చెప్పారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, పోరాటాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి 10 నెలల పాలనలో ప్రజలపై విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని మోపిందన్నారు. సెకీతో జరిగిన ఒప్పందాల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలపై ఆందోళనకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరాములు, సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

350 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా కాపు బట్టీల వద్ద స్వాధీనం చేసుకున్న సారా తయారు సామగ్రి

పాయకరావుపేట: పట్టణం పరిధిలో పలు సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 350 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా జరిగిన దాడుల్లో పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, దుర్గా కాలనీని చెందిన ఇద్దరు వ్యక్తులను సారా తయారీ కేసులో అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 15 కేజీల నల్ల బెల్లం, 3 కేజీల అమ్మోనియంను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితులను యలమంచిలి కోర్టుకు తరలించామన్నారు.

స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ఫైనల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి సంబంధించిన అభ్యర్థుల ఫైనల్ జాబితాను శుక్రవారం రాత్రి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి విడుదల చేశారు. ఈ జాబితాను https@//cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ ఫైనల్ జాబితాపై కూడా అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను రేసపువానిపాలెంలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని ఆర్డీ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిశీలించిన తర్వాత ఎంపిక జాబితాను విడుదల చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి జనవరి 27న ప్రాథమిక (ప్రొవిజనల్) జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ జాబితాపై మూడు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించారు. అయితే, ఇంతలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అమలులోకి రావడంతో జాబితా పరిశీలన కార్యక్రమం నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ జాబితాల పరిశీలన ప్రారంభించారు.

దరఖాస్తుల వివరాలు: మొత్తం 6 జిల్లాల్లోని 106 స్టాఫ్ నర్సు పోస్టుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. ఆ తరువాత పోస్టులు మరో 264 పెరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్ , ఆఫ్‌లైన్‌లో కలిపి మొత్తం 8300 దరఖాస్తులు వచ్చాయి. ప్రాథమిక జాబితాపై అభ్యంతరాలు తెలుపుతూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి 1,570 దరఖాస్తులు చేరుకున్నాయి.

దళారులను నమ్మవద్దు

పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుంది. దళారులను ఎవరూ నమ్మవద్దు. అర్హత ప్రమాణాలు, మెరిట్ , రోస్టర్ ప్రకారం ఫైనల్ జాబితా రూపొందించాం. అభ్యర్థులు ఎవరితోనూ సిఫార్సు చేయించవద్దు.

– డాక్టర్ పి. రాధారాణి, ఆర్డీ

క్లుప్తంగా

సెల్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం మూర్తి

కశింకోట: సెల్ ఫోన్లు, టీవీలకు విద్యార్థులను దూరంగా ఉంచాలని వెదురుపర్తి హైస్కూలు హెచ్‌ఎం ఎంవీఎస్ మూర్తి కోరారు. వెదురుపర్తి హైస్కూలులో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గని రెడ్డి శివ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఎస్‌ఎ-2 (వార్షిక పరీక్షలు) జరగనున్నాయన్నారు. వాటికి విద్యార్థులను ఇళ్ల వద్ద బాగా చదివించి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. వారు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటిని ఎక్కువగా తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కన వెలసిన దేవాదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయంలో ఈ నెల 6న శ్రీరామ నవమి పురస్కరించుకొని సీతారాములు కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కల్యాణం, 12 గంటలకు అన్న సమారాధన జరుగుతాయన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు.

మహిళలను గౌరవించడం మానవ ధర్మం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మణికుమారి

అనకాపల్లి టౌన్: మహిళలను గౌరవించడం మానవ ధర్మం అని రూరల్ ఏఎస్‌ఐ ఎం మణికుమారి తెలిపారు. అక్కిరెడ్డిపాలెం పంచాయతీ టీఆర్ కాలనీ జెడ్పీ పాఠశాలలో బాలికలకు శక్తి టీంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు ఆకతాయిల నుంచి ఎలా రక్షించుకోవాలో ట్రిక్స్ ప్రాక్టికల్‌గా వివరించారు. హెచ్‌ఎం ఎం బాపునాయుడు, పీఈటీ కె. శ్యామల, మహిళా కానిస్టేబుల్ టి. పుష్ప పాల్గొన్నారు. టౌన్ గర్ల్స్ హైస్కూల్ జరిగిన కార్యక్రమంలో రూరల్ ఏఎస్‌ఐ మణికుమారి పాల్గొన్నారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు.

రేపు సీతారాముల కల్యాణోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.ఎం. నాయుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం పెదబోయిగూడెం సీతారామ ఆలయంలో ఈ నెల 6న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవం పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం. నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మైపాళి పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు జయకృష్ణ, కార్యదర్శి వీరాల జగన్నాథరావు, సహాయ కార్యదర్శి జోడా దిలీప్ కుమార్, కోశాధికారి సన్నికంటి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల: మండలంలో మదర్ థెరిసా దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం 26వ సర్వసభ్య సమావేశం గొలగాంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంఘ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా కసిరెడ్డి అర్జున్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అక్కిరెడ్డి గోవింద, కార్యదర్శిగా పాతాళ లక్ష్మణ, సహ కార్యదర్శిగా దాడిశెట్టి శీను, సెక్రటరీగా మింది రాము, సహాయ కార్యదర్శిగా పూడి బ్రహ్మాజీ రావు, సభ్యులుగా నాగేశ్వరరావు, వీర్రాజు, కనకరాజు, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలని ధర్నా

అనకాపల్లి: అనకాపల్లి -చోడవరం రహదారిలో పెద్ద గోతులతో మృత్యువాత పడుతున్నారని, తక్షణమే బాగు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. మండలంలో బవులవాడ గ్రామంలో అనకాపల్లి–చోడవరం రోడ్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. పూర్తిగా గోతులమయంగా ఉన్న ఈ రోడ్డు బాగు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'సర్'విస్ రోడ్డు పూర్తి చేయరూ..



పులికాలువ వంతెన వద్ద అస్పష్టంగా ఉన్న సర్వీస్ రోడ్డు



రైల్వేట్రాక్ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు

- బైపాస్ జంక్షన్ నుంచి శంకరం వైపు అసంపూర్తిగా నిర్మాణం
- రైల్వే ట్రాక్ అడ్డంకితో నిలిచిపోయిన రోడ్డు
- పులికాలువ హైవే వద్ద ప్రయాణికుల గందరగోళం

తుమ్మపాల: వందల కోట్లతో అధునాతనంగా నిర్మించిన అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారిపై ప్రయాణం ఇప్పుడెంతో సాఫీగా సాగిపోతోంది. అయితే దీనికి అనుసంధానంగా వేసిన సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పర్యవసానంగా ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణానికి అద్భుతమైన స్వాగతం పలికేలా జలగల మధుం బైపాస్ జంక్షన్ వద్ద జాతీయ రహదారి (ఇంటర్ సెక్షన్ లింక్ జంక్షన్) నిర్మించారు. అయితే విజయవాడ వైపు నుంచి ఆనందపురం జాతీయ రహదారికి చేరుకునే మార్గంలో నేటికీ సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. బైపాస్ జంక్షన్ వద్ద విశాఖపట్నం, విజయవాడ వైపు స్పష్టమైన రహదారి మార్గం ఉన్నప్పటికి ఆనందపురం వైపు నేమ్ బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఇంటర్ సెక్షన్ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి ఆనుకుని దుర్భరంగా ఉన్న సర్వీస్ రోడ్డుపై ప్రయాణిస్తూ వస్తే రైల్వే ట్రాక్ అడ్డంకి, అక్కడ మందుబాబుల భయంతో వాహనాలపై వెళ్లిన వారు భయాందోళనకు గురవుతున్నారు.

నబ్బవరం వైపు వెళ్లాలంటే పట్టణంలోకి రావాల్సిందే...

అనకాపల్లి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల రహదారులకు ప్రధాన జంక్షన్ అయిన బైపాస్ వద్ద ఇంటర్ సెక్షన్‌తో మొదలైన అనకాపల్లి -ఆనందపురం హైవే సుమారు 40 కిలోమీటర్ల మేర విస్తరించి సర్వీస్ రోడ్డుతో కలిపి ఆరు లైన్ల రహదారి అభివృద్ధి జరిగింది. అయితే అనకాపల్లి బైపాస్ జంక్షన్ వద్ద ఇంటర్ సెక్షన్ లింక్ నుంచి సబ్బవరం వైపు కిలోమీటరు దూరంలో ఉన్న రైల్వే ట్రాక్ అడ్డంకితో సర్వీస్ రోడ్డు పూర్తి చేయకుండా హైవే అభివృద్ధి కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో తీవ్ర దుర్గంధంగా తయారై మందుబాబులకు అడ్డాగా మారింది. విజయవాడ, విశాఖ వైపు నుంచి సబ్బవరం వైపు వెళ్లాల్సిన సుదూర ప్రాంతాల ప్రయాణికులు దర్భరంగా ఉన్న మట్టి రోడ్డులో ప్రయాణించి రైల్వే ట్రాక్ వద్ద మందుబాబుల ఆగడాలకు గురవుతున్నారు. ప్రత్యామ్నాయంగా చేరుకోవాలంటే బైపాస్ జంక్షన్ నుంచి అనకాపల్లి పట్టణంలోకి చేరుకుని డీ–మార్ట్ మీదుగా శంకరం వద్ద పులికాలువ వంతెన ద్వారా జాతీయ రహదారికి చేరుకుంటున్నారు. పేరుకు జాతయ రహదారి అయినప్పటికి ప్రారంభంలో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



బైపాస్ జంక్షన్ వద్ద సబ్బవరం వైపు పూర్తికాని సర్వీస్ రోడ్డు

అయోమయానికి గురవుతున్న ప్రయాణికులు

ఆనందపురం- అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు శంకరం దాటి పులికాలువ వంతెన వద్ద తీవ్ర అస్పష్టతకు గురవుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, అరకు, తగరపువలస, పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చే వాహనదారులు నేరుగా విజయవాడ వైపు వెళ్లాల్సి ఉంది. అయితే శంకరం వద్ద పులికాలువ వంతెనపై నుంచి అనకాపల్లి పట్టణంలోకి చేరి అక్కడ నుంచి బైపాస్ జంక్షన్ నుంచి జాతీయ రహదారి చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. శంకరం పులికాలువ జాతీయ రహదారి వంతెన దాటి రైల్వే ట్రాక్ వరకు అసంపూర్తి సర్వీస్ రోడ్డు ఉండటంతో దూర ప్రాంత వాహనదారులు పులికాలువ దాటి ట్రాక్ వరకు 1.5 కిలోమీటర్ల దూరం వెళ్లి వెనక్కు తిరిగి వస్తూ అయోమయానికి గురవుతున్నారు. పులి కాలువ వంతెన వద్ద ఎటువంటి రూట్ మ్యాప్ స్టిక్కర్లు లేకపోవడంతో పగలు, రాత్రిళ్లు పూర్తికాని రూట్‌లో ముందుకెళ్లి వెనుతిరుగుతున్నారు.

సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి



జాతీయ రహదారి ఆనుకుని పులికాలువ నుంచి రైల్వే ట్రాక్ వరకు పూర్తి చేసిన సర్వీస్ రోడ్డు అటుగా బైపాస్ జంక్షన్ వరకు పూర్తి చేయాలి. రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి గాని, వంతెన గాని ఏర్పాటు చేసి సర్వీస్ రోడ్డు కొనసాగించాలి. జాతీయ రహదారి అభివృద్ధికి భూములిచ్చిన రైతులు తమ పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. సర్వీస్ రోడ్డు పూర్తయితే అనకాపల్లి పట్టణంలోకి వెళ్లకుండా సులభంగా ఇతర ప్రాంతాలకు చేరుకోవచ్చు.

– పెట్ల సన్యాసిరావు, అనకాపల్లి

స్థానిక ఎంపీ దృష్టి సారించాలి



కూటమి ప్రభుత్వం రాగానే పట్టణానికి ముఖద్వారమైన బైపాస్ జంక్షన్ బోసిపోయింది. ఇంటర్ లింక్ సెక్షన్ వద్ద ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కు ఎండిపోతోంది. అక్కడ ఏర్పాటు చేసిన జాతీయ జెండా చిరిగిపోయి స్తూపం బోసిపోయింది. సబ్బవరం వైపు జాతీయ రహదారి ఆనుకుని సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. స్థానిక ఎంపీ సీఎం రమేష్ దృష్టి సారించి అభివృద్ధి చేయాలి.

– నారపిన్ని ప్రసాద్, అక్కిరెడ్డిపాలెం

పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుల నియామకం



త్రినాథ్



ఎ-హరికృష్ణ



పద్మకుమారి



దివాకర్



సూకరత్నం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులను శుక్రవారం ప్రకటించారు. అనకాపల్లి పట్టణ యువజన విభాగం అధ్యక్షునిగా వేగి త్రినాథ్, అనకాపల్లి మండల యువజన విభాగం అధ్యక్షునిగా బాధపు హరికృష్ణ, కశింకోట మండల అధ్యక్షునిగా నీటిపల్లి దివాకర్, అనకాపల్లి మండల మహిళా యూత్ విభాగం అధ్యక్షురాలిగా కొట్నాల పద్మ కుమారి, కశింకోట మహిళా యూత్ విభాగం అధ్యక్షురాలిగా తగరంపూడి సూకరత్నంలను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్థిక బలోపేతానికే కార్పొరేషన్ రుణాలు



మాట్లాడుతున్న ఏపీడీ యల్లపు సంతోష్



సమావేశానికి హాజరైన దరఖాస్తుదారులు

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరినీ ఆర్థికంగా బలోపేతం చేయడానికే ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలను అందిస్తుందని జీవీఎంసీ జోన్ ఏపీడీ యల్లపు సంతోష్ తెలిపారు. స్థానిక గుండాల జంక్షన్ ఆర్వో ఆఫీస్‌లో శుక్రవారం వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తున్న వారికి బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఐదు వార్డుల్లో 856 మంది దరఖాస్తులు చేసుకోగా, 738 మంది హాజరయ్యారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ సారి రుణం రాకపోయినా నిరుత్సాహ పడవద్దన్నారు. వారు మరొక సారి దరఖాస్తు చేయకుండానే తర్వాత సంవత్సరానికి అర్హులవుతారన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ రుణాలు తీసుకున్న వారు క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లింపులు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు జోగినాయుడు, ఆళ్ల రామచంద్రరావు, బుద్ద శ్రీనివాసరావు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

అనకాపల్లి టౌన్: మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని వెంకుపాలెం రైతు సేవా కేంద్రంలో మండల వెలుగు, వ్యవసాయ శాఖ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావల్సిన పీఎండీఎస్ ఘన, ద్రవ జీవ అమృతాలు, కషాయాలు, పచ్చిరొట్ట ఎరువులు, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై, వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలు గురించి వివరించారు. ఎరువుల వాడకం వల్ల వచ్చే నష్టాలను రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను తెలియజేయాన్నారు. ఏడీఏ రామారావు, ఏవో పీబీ రంగాచారి, మండల వెలుగు ఏపీఎం కొడమ్మ, వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



పల్లకీలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ వీలీన గ్రామం కొత్తూరు పంచాయతీ కేఎస్‌ఆర్ పేటలో సీతారాముల కల్యాణం మహోత్సవంలో భాగంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలు, సీతాదేవికి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఉంచి ఊరేగించారు. మహిళలంతా పిండివంటలు ఊరేగించి ఆలయంలో నైవేద్యంగా పెట్టి పలువురికి పంచిపెట్టారు. గ్రామ పెద్దలు కసిరెడ్డి సత్యనారాయణ, చేబ్రోలు దుర్గాప్రసాద్, అల్లారపు రామస్వామి, యువకులు పాల్గొన్నారు.

తనిఖీల్లో వాహనదారులకు వేధింపులు

అనకాపల్లి: పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌లు వాహనాలు తనిఖీ చేసే సమయంలో వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.శ్రావణికు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. వాహనదారులను అవమానపరిచే విధంగా పోలీస్‌లు వ్యవహరిస్తున్నారని, మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులపై అపరాధ రుసుం విధించాలని, రికార్డులు ఉన్నా వేధిస్తున్నారని వాపోయారు. ప్రజా సంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, సూదికొండ మాణిక్యాలరావు, కొట్టుమూరి మంగరాజు, బొబ్బిలి గోవిందరాజులు పాల్గొన్నారు.

8న నేత్ర వైద్య శిబిరం

అనకాపల్లి: విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 8న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రాజా ఆప్టికల్స్ ఆస్పత్రి వద్ద ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సాయి రాజా వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పూసర్ల రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలు చేసుకునే రోగులు ఈ నెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



నిందితుడితో ఎస్‌ఐ గణేష్, సిబ్బంది

అనకాపల్లి/తుమ్మపాల: బెల్టుషాపుపై దాడి చేసి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ వైఎల్ నాయుడు శుక్రవారం తెలిపారు. మండలంలో మారేడుపూడి గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేయగా, నిందితుడు పీత త్రినాథ్‌ను పట్టుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సంగమ్

అనకాపల్లి టౌన్: వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తుమ్మపాల పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ బి. సంగమ్ వివరించారు. మండలంలోని గొలగాం గ్రామ సచివాలయంలో అవగాహన కల్పించారు. వేసవిలో బయటకు వచ్చే ప్రజలు వీలైనంత వరకు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోడ్లపై అమ్మే రంగు పానీయాలు తాగొద్దని, కొబ్బరి బొండాలు, ఓఆర్‌ఎస్, మజ్జిగ వంటివి మాత్రమే సేవించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి. అనిత, ఏఎన్‌ఎం జి. సంతోషి, హెల్త్ అసిస్టెంట్ పెంటారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

11న బీసీ సమరభేరి



నిరసన పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: బీసీ సమరభేరి కార్యక్రమం ఈనెల 11న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో నిరసన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ, సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధన కోసం బీసీ కుల, జన గణన తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ్, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్, బీసీ సంఘం జిల్లా నాయకులు వాయిబోయిన శేఖర్, బొడ్డేడ అప్పారావు, బొబ్బిలి గోవింద్, విత్తనాల పోతురాజు, మత్సుర్తి సూరిబాబు, సూదికొండ బాలరాజు, హేమంత్ పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల పెళ్లి రాట



సీతారాముల పెళ్లి రాటకు పూజలు



సీతారాములు కల్యాణం పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కల్యాణ రాటకు పూజలు చేస్తున్న భక్తులు



బయ్యవరంలో సీతారాముల కల్యాణ రాట

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో చేపల బజార్ జంక్షన్ వద్ద కొలువైన సీతారామ ఆలయం వద్ద శుక్రవారం రాములోరి కల్యాణ పెళ్లిరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం ఈ నెల 6వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావునాయుడు, అధ్యక్షుడు కె.నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని జమాదులపాలెం రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పెళ్లి రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాల సంఘం అధ్యక్షుడు పరవాడ రాము, స్థానిక నాయకులు ఒమ్మి గంగునాయుడు పాల్గొన్నారు.

- గవరపేటలో శారదా గణపతి రామాలయంలో శుక్రవారం పెళ్లి రాట వేశారు. శారదా నది ఆవల తోట నుంచి నేరేడు కొమ్మను తెచ్చి దానికి పసుపు రాసి, బొట్లు పెట్టి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం డబ్బాలో పాలు, నవధాన్యాలు, నవరత్నాలు వేసి దానిలో రాటను నిలిపి మట్టితో కప్పారు. దానిపై ఆవు పేడతో అలికి ముగ్గులు పెట్టి మళ్లీ పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.
- కొత్తపల్లి రామాలయంలో శుక్రవారం నేరేడు కొమ్మ తెచ్చి పూజలు చేసి పెళ్లి రాట వేశారు. సర్పంచ్ కోన నాయుడు, కాంగ్రెస్ నాయకుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బయ్యవరంలోని మీద వీధి రామాలయం వద్ద సీతారాముల పెళ్లి రాట వేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొల్లవిల్లి సాయబునాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కశింకోట: రోడ్డుపై జారి పడి తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన ఐటీఐ చదువుతున్న పునీత్‌రాజు(17) గత నెల 31న చర్చికి వెళ్లి వచ్చి ఆటోలో దిగిన తర్వాత రోడ్డు దాటుతుండగా జారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. ఆయనను అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం జరిపించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు ఎలా పడిపోయాడనే విషయమై ఇంకా సమగ్రంగా విచారిస్తున్నామన్నారు.

8న లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

కశింకోట: స్థానిక పురాతన వరహా లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈ నెల 8న రాత్రి 7 గంటలకు స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. కాకర కల్యాణ్, ఆశ దంపతులు వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం జరగనుందన్నారు. ఈ నెల 13న రాత్రి స్వామివారికి పుష్పాంజలి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.